సాక్షి ఆదిలాబాద్

గురువారం । 6 । జూన్ । 2024



ఆదర్శం.. 'మల్యాల్' గూడెం

ఇచ్చోడ మండలం మల్యాల్ జీపీ పరిధిలో ఏర్పాటు చేసుకున్న ఆదివాసీ గూడెం ఆదర్శంగా నిలుస్తోంది. 8లో▸



ఆ ఈవీఎంలు గోడౌన్‌కు తరలింపు

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గంలో వినియోగించిన ఈవీఎంలను హైకోర్టు తీర్పు నేపథ్యంలో అధికారులు గోడౌన్‌కు తరలించారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
38.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఐసెట్



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ జిల్లా కేంద్రంలో బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పట్టణంలోని నలంద కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 100 మందికి గాను 94 మంది, మధ్యాహ్నం పరీక్షకు 91 మందికి గాను 87 మంది హాజరైనట్లు కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ పున్నరావు తెలిపారు. పరీక్షకు నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రానికి చేరుకున్నారు.

8న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఆదిలాబాద్‌టౌన్: మృగశిరకార్తె పురస్కరించుకొని ఈ నెల 8న ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్య ఆయుర్వేదిక్ రీసెర్చ్ సెంటర్ డాక్టర్ యువరాజ్ వైద్య ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని సీసీఐ ఎక్స్‌రోడ్ వద్ద గల ఆయుర్వేదిక్ రీసెర్చ్ సెంటర్‌లో శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉబ్బస వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 94402 47332 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సీఆర్పీఎఫ్ బలగాల విధులు భేష్

• అదనపు ఎస్పీ సురేందర్‌రావు



సీఆర్పీఎఫ్ జవాన్లతో అదనపు ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: సీఆర్పీఎఫ్ జవాన్లు క్రమశిక్షణ, సమయపాలనకు మారుపేరుగా నిలిచారని అదనపు ఎస్పీ సురేందర్ రావు అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించిన సీఆర్పీఎఫ్ సిబ్బందికి బుధవారం జిల్లా నుంచి వీడ్కోలు పలికారు. పూలమాలలు అందజేసి శాలువాలతో సత్కరించారు. పట్టణంలోని వైటీసీలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద క్రమశిక్షణతో 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీఐలు సత్యనారాయణ, అశోక్, ఫణిందర్, మావల ఎస్సై విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఢిల్లీకి ఎంపీ నగేశ్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన గొడం నగేశ్ నేడు ఢిల్లీకి వెళ్లనున్నారు. మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఢిల్లీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న పార్టీ కార్యవర్గ సమావేశాల్లో ఆయన పాల్గొననున్నారు. పార్టీ శ్రేణులు, అధికారులు, ప్రజలు విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.



మంగళవారం నిర్వహించిన విజయోత్సవ సంబరంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

కమలోత్సాహం

• 'పార్లమెంట్' సీటు మరోసారి కైవసం చేసుకున్న నేపథ్యంలో..
• బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రాతినిధ్యంలోనూ బీజేపీ సత్తా
• గ్రామీణ ప్రాంతాల్లోనూ పెరిగిన 'కాషాయ' ఓటు బ్యాంక్
• 'స్థానిక' ఎన్నికలకు ముందు కేడర్‌లో జోష్

మొత్తం ఓట్లు :16,50,175

పోలైన ఓట్లు :12,35,597

శాతం:74.03

అభ్యర్థులు సాధించిన ఓట్లు..
గోడం నగేశ్ (బీజేపీ):5,68,168 (45.98 శాతం)
ఆత్రం సుగుణ (కాంగ్రెస్):4,77,516 (38.65 శాతం)
ఆత్రం సక్కు (బీఆర్‌ఎస్):1,37,300 (11.11 శాతం)
మెజార్టీ(బీజేపీ):90,652 ఓట్లు

సాక్షి,ఆదిలాబాద్: కమలం పార్టీలో ఉత్సాహం కనిపిస్తోంది. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని తిరిగి దక్కించుకోవడం, మెజార్టీ కూడా పెరగడం ఇందుకు కారణం. ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్‌లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నియోజకవర్గాల్లో గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఆదరణ ఉంటుందని ఆ పార్టీ మొదటి నుంచి అంచనా వేసింది. ఇందుకు తగ్గట్టుగా నిర్మల్, ముథోల్‌లో పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ దక్కింది. అలాగే సిర్పూర్, ఆదిలాబాద్‌లోనూ గత అసెంబ్లీ ఎన్నికలను మించి అత్యధికంగా ఓట్లు పోలయ్యాయి. ఈ విధంగా ఈ నియోజకవర్గాల్లో కమలదళం బలం మరింత పెరిగింది.

ప్రత్యర్థుల క్షేత్రాల్లోనూ..

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నాలుగు స్థానాల్లో గెలుపొందగా, ఆసిఫాబాద్, బోథ్‌లో బీఆర్‌ఎస్, ఖానాపూర్‌లో కాంగ్రెస్ గెలుపొందాయి. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బోథ్, ఖానాపూర్‌లోనూ బీజేపీ విజయ దుందుంబి మోగించింది. ఇటు బీఆర్‌ఎస్, అటు కాంగ్రెస్‌కు మించి అత్యధికంగా ఓట్లు దక్కించుకుంది. ఒక్క ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మాత్రమే కాంగ్రెస్‌కు మెజార్టీ లభించింది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో మూడోస్థానంలో నిలిచిన బీజేపీ ఈ నియోజకవర్గంలో రెండో స్థానానికి ఎగబాకింది. తద్వారా ప్రత్యర్థుల క్షేత్రాల్లోనూ పాగా వేస్తుంది. మొత్తంగా పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ అన్ని నియోజకవర్గాల్లో ఎక్కువ ఓట్లు రావడంతో ఆ పార్టీ కేడర్‌లో ఉత్సాహం కనిపిస్తుంది.

బీజేపీకి ప్రధానంగా పట్టణ పరిధిలో ప్రాబల్యం ఉంటుందని ముందు నుంచి రాజకీయంగా చర్చ సాగేది. అయితే ఈ ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లోనూ ఓట్లు సాధించామని సోషల్ మీడియాలో పలువురు ఆయా మండలాల నుంచి సాధించిన మెజార్టీకి సంబంధించి పోస్టులు పెడుతున్నారు. ఈ పరిణామం కమలం పార్టీలో మరింత ఉత్సాహం నింపుతుంది. ప్రధానంగా రాబోయే రోజుల్లో

గ్రామీణ ప్రాంతాల్లోనూ..

స్థానిక సంస్థల ఎన్నికల పరంగా పార్టీకి ఇది ఉపయుక్తంగా ఉంటుందని ప్రస్తుతం చర్చ సాగుతుంది. గత స్థానిక సంస్థల ఎన్నికల పరంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కేవలం ఆదిలాబాద్ జిల్లా నుంచి బీజేపీ ఐదు జెడ్పీటీసీ స్థానాలు సిరికొండ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ, ఇచ్చోడలో గెలుపొందింది. పార్లమెంట్ ఎన్నికల్లో సాధించిన ఓట్ల శాతంతో ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ పలువురు బీజేపీ నుంచి పోటీ చేయాలనే ఆసక్తి కూడా కనబర్చుతున్నారు. మొత్తంగా ఈ అంశాలు ప్రస్తుతం ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

యూనిఫాం అందేనా..?

• మరో ఆరు రోజుల్లో బడి పునఃప్రారంభం
• ఇప్పటివరకు 59 శాతం మాత్రమే పూర్తి
• తొలిరోజు అందడం అనుమానమే
• 'స్వయం' సంఘాల ఆధ్వర్యంలో కుట్టు పని

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు : 1,200
డీఈవో పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య: 56,392
జిల్లాలో స్వయం సహాయక సంఘాలు : 10,756
స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు : 1,16,885
యూనిఫాం కుట్టేందుకు ఎంపికైన సభ్యులు : 1,804
కుట్టాల్సిన విద్యార్థుల యూనిఫాం జతలు : 1,68,194



యూనిఫాం కుట్టు తీరును పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల పునఃప్రారంభమయ్యే నాటికి పూర్తిస్థాయిలో యూనిఫాం అందడం అనుమానంగానే కనిపిస్తోంది. పేద విద్యార్థులకు యూనిఫాం అందించే దిశగా జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. వీటిని కుట్టే బాధ్యతలను స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగించిన విషయం తెలిసిందే. విద్యా శాఖ నుంచి వస్త్రం కొనుగోలు చేసి సంఘాల సభ్యులకు అప్పగించారు. ఇప్పటివరకు 59 శాతం వరకు కుట్టు పని పూర్తవగా, మిగతావి ఈ ఆరు రోజుల్లో పూర్తవుతుందా.. లేదా అనేది వేచి చూడాల్సిందే. అయితే ఈ యూనిఫాంలు కేవలం డీఈవో పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ప్రస్తుతం స్టిచ్చింగ్ చేస్తున్నారు. మిగతా యాజమాన్యాలకు సంబంధించి కుట్టాల్సి ఉంది. ఇవే ఇంకా పూర్తిస్థాయిలో కుట్టే ప్రక్రియ పూర్తి కాకపోగా, వాటి పరిస్థితి ఏమిటో తెలియడం లేదు. ఇదివరకు ఒక్కో యూనిఫాం కుట్టు కూలి రూ.50 ఉండగా, ప్రభుత్వం ఇటీవల మరో రూ.25 పెంచి ప్రస్తుతం రూ.75 చెల్లిస్తుంది. వేసవి లోనే ఈ ప్రక్రియ పూర్తవ్వాల్సి ఉండగా, ఇంకా కొనసాగుతుండడంతో ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నట్లు పలువురు అభిప్రాయ పడుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలోమొత్తం 1,200 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉండగా, ఇందులో 84,097 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 42,082 మంది బాలురు, 42,015 మంది బాలికలు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం ఏటా రెండు జతల యూనిఫాంలు ఉచితంగా పంపిణీ చేస్తోంది. గతంలో ఎస్‌ఎంసీల ద్వారా కుట్టించారు. అయితే మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సారి వారికే యూనిఫాం కుట్టు బాధ్యతలు అప్పగించింది. డీఈవో పరిధిలో 700 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 56,392 మంది విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం వీరికి మాత్రమే యూనిఫాం కుడుతున్నారు. డీఆర్డీఏ అధికారుల వివరాల ప్రకారం బుధవారం నాటికి 16,572 మంది బాలురు, 16,752 మంది బాలికలకు మొత్తం 33,324మంది విద్యార్థుల యూనిఫాంలను స్టిచ్చింగ్ చేసినట్లు లెక్కలు చెబుతున్నారు. మరో 10,383 మంది బాలురు, 12,215 మంది బాలికలు మొత్తం 23,068 మంది యూనిఫాం కుట్టాల్సి ఉన్నాయి. అయితే అత్యల్పంగా బేల మండలానికి సంబంధించి 49 శాతం మాత్రమే కుట్టడం పూర్తయింది. ఆ తర్వాత ఇంద్రవెల్లి 50 శాతం, గుడిహత్నూర్ 51శాతం, నేరడిగొండ 52శాతం, బోథ్ 53 శాతం, ఆదిలాబాద్‌రూరల్ 54 శాతం పూర్తయింది. అత్యధికంగా సిరికొండ 74శాతం, ఇచ్చోడ, తాంసి 71 శాతం, గాదిగూడ 70శాతం యూనిఫాంలు కుట్టడం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

ఏటా ఆలస్యమే..

ప్రభుత్వం విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు, పుస్తకాలు అందించాలని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. ఏటా ఆలస్యమే జరుగుతోంది. గతేడాది ఆగస్టు వరకు విద్యార్థులకు పూర్తిస్థాయిలో యూనిఫాంలు అందించలేదు. ఈసారి కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. మొదటి రోజు విద్యార్థులకు యూనిఫాం అందజేస్తే ఉత్సాహంగా బడికి వస్తారు. ఏదేమైనా అధికారులు పర్యవేక్షణ చేపట్టి బడులు ప్రారంభమయ్యేలోగా ప్రక్రియ పూర్తి చేస్తే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

పాఠశాలలు తెరిచేలోగా అందజేస్తాం..



పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థులకు పూర్తిస్థాయిలో యూనిఫాంలు అందేలా చర్యలు చేపడుతున్నాం. స్వయం సహాయక సంఘాల సభ్యులకు కుట్టే బాధ్యతలు అప్పగించాం. ప్రక్రియ వేగవంతం చేసేలా చూస్తున్నాం. దాదాపు 60 శాతం వరకు పూర్తయింది. మిగతావి త్వరలో కుట్టేలా చూస్తాం. – ప్రణీత, డీఈవో

'ఆదిలాబాద్' అభివృద్ధికి సమష్టి కృషి



మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

• సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
• ఎంపీ గోడం నగేశ్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి కృషి చేస్తానని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి మాట్లాడారు. పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుడిలా కష్టపడ్డారన్నారు. అందరి సమన్వయంతోనే గెలుపు సాధ్యమైందన్నారు. ఈ విజయాన్ని ప్రధాన నరేంద్రమోదీకి అంకితం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే పార్లమెంట్ పరిధిలోని ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే జిల్లా కేంద్రంలోని రైల్వే అండర్ ఓవర్ బ్రిడ్జికి సంబంధించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 50 శాతం వాటాలతో వంతెనలు నిర్మించేలా అనుమతులు వచ్చాయన్నారు. అలాగే జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్మూర్ రైల్వేలైన్, రైల్వే ఓవర్ బ్రిడ్జి, జాతీయ రహదారుల విస్తరణ, ఇతర సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా ప్రజలు తమ వైపే నిలబడి విజయాన్ని అందించారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు రావుల రాంనాథ్, ఆదినాథ్, అశోక్ ము స్తాపురే, విజయ్, మయూర్ చంద్ర, దినేష్ మటో లియా, లాలా మున్నా, ప్రవీణ్, రాజేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నాటిన మొక్కకు నీరు పోస్తున్న జిల్లా జడ్జి కె.ప్రభాకర్‌రావు



హరితవనం పార్కులో మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా జడ్జి కె.ప్రభాకర్‌రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. నాటిన మొక్కలను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు జడ్జి కె.శివరాం ప్రసాద్, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి బి.సౌజన్య, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీళ జైన్, జూనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యవార్, స్పెషల్ జేఎంఎఫ్‌సీ పీసీఆర్ కోర్టు జడ్జి దుర్గరాణి, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ సాధ్యం

చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని జిల్లా సంక్షేమ అధికారి సబితా అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీడీపీవో వనజ, సూపర్‌వైజర్ ఫర్హా, అంగన్‌వాడీ కార్యకర్త రాధ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హరితవనం పార్కులో

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని హరితవనం పార్కులో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటారు. అలాగే పార్కులోని ప్లాస్టిక్, చెత్తను తొలగించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వో గులాబ్‌సింగ్, ఎఫ్‌బీవో ప్రశాంత్, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని ఎస్సీస్టడీ సర్కిల్ సెంటర్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక, పర్యావరణ సబ్‌కమిటీ కన్వీనర్ ఆర్ శివకుమార్ మాట్లాడుతూ..ప్రభుత్వం గ్రీన్ టాక్స్ పేరిట ప్రజల నుంచి వసూలు చేస్తున్న సొమ్ము కేవలం పర్యావరణ హితానికే వినియోగించాలన్నారు. ఇందులో వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి శ్రీధర్ బాబు, వీరన్న, గంగన్న, ఉమాకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలా.. సమాచారం ఇవ్వండి



ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ సర్కిల్ పరిధిలోని ఆయా మండలాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తితే వినియోగదారులు ఈ ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని ఆ శాఖ ఏఈ జేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

సెక్షన్	ఎఫ్‌వోసీ నంబర్	ఏఈ నంబర్
ఆదిలాబాద్ నార్త్	9491075548	9440811694
ఆదిలాబాద్ సౌత్	9491075548	9440811695
ఆదిలాబాద్‌టౌన్-3	9492934689	9490614551
ఆదిలాబాద్‌రూరల్	7730967559	9440811698
మావల	6304469659	8331017767
తాంసి	9491075553	9440811696
తలమడుగు	9491075554	8333923873
భీంపూర్	8125105301	8331017768
జైనథ్	9491075551	9440811697
బేల	9491075552	8333923874
భోరజ్	9491075556	8331017765
ఇచ్చోడ	9491075558	9440811699
బజార్‌హత్నూర్	9491075559	8331017764
బోథ్	9666101351	9440811701
నేరడిగొండ	9491075562	8333923872
ఉట్నూర్	9491075563	9440814174
నార్నూర్	9491075564	8333923870
ఇంద్రవెల్లి	9491075567	9440811702
గుడిహత్నూర్	9491075568	8333923871
సిరికొండ	9491074561	9440811702

ఓడినా.. ప్రజల మధ్యనే ఉంటా

• కాంగ్రెస్ నాయకురాలు సుగుణ



చేతులు జోడించి కృతజ్ఞతలు తెలుపుతున్న ఆత్రం సుగుణ

కైలాస్‌నగర్: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజా తీర్పును శిరసావహిస్తూ తాను ఓడినా నిత్యం ప్రజల మధ్యలోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజాసేవా భవన్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో తన ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి చేసి రాజకీయాల్లోకి వచ్చానని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి తరపున ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తానన్నారు. ఎన్నికల్లో తనకు అన్నివిధాలా అండగా ఉండి ముందుకు నడిపించిన ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేశ్, పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. తనను ఆదరించి ఓటేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ నైతిక విజయం కాంగ్రెస్‌దేనన్నారు. ఇందులో ఆదిలాబాద్, నిర్మల్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, కూచాడి శ్రీహరిరావ్, ఆడే గజేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రూపేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి'


మాట్లాడుతున్న కొడప నగేశ్

ఇచ్చోడ: చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేంత వరకు ఉద్యమం కొనసాగుతుందని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ అన్నారు. కేసు విచారణలో భాగంగా కోర్టుకు హాజరైన ఆయన మాట్లాడారు. ఎన్ని కేసులు పెట్టినా ఆదివాసీ ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఆయన వెంట తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గోడం గణేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామేల్లి భోజన్న , ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడల స్వామి ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


ప్రవీణ్ యాదవ్ (ఫైల్)

తాంసి: మండలంలోని జామిడి గ్రామానికి చెందిన ప్రవీణ్ యాదవ్ (34) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య మౌనిక, కూతురు ఉన్నారు.

రిమ్స్‌కు పొల్యూషన్ రహిత అవార్డు


అవార్డు అందుకుంటున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఉత్తమ కాలుష్య రహిత అవార్డు దక్కింది. బుధవారం హైదరాబాద్‌లో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణిప్రసాద్ చేతుల మీదుగా డీఎంఈ వాణితో కలిసి ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య


దుయిపోడే పండిత్(ఫైల్)

ఇంద్రవెల్లి: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఏమాయికుంట జీపీ పరిధిలోని రమాయినగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై దుబ్బక సునీల్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన దుయిపోడే పండిత్ (44) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నెల రోజులుగా మద్యానికి బానిసై వచ్చిన డబ్బులు తాగుడుకు ఖర్చు చేసేవాడు. ఈ నెల 1న ఇంట్లో ఉన్న జొన్నలు కూడా అమ్ముకోవడంతో అతని భార్య రుక్మాబాయి ఎందుకు అమ్మావని ప్రశ్నించడంతో గొడవ జరిగి బయటకు వెళ్లిపోయాడు. మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఇంటికి వచ్చాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదర్శం.. మల్యాల్ ఆదివాసీ గూడెం

- తొమ్మిదేళ్ల క్రితం 30 కుటుంబాలు సంఘంగా ఏర్పాటు
- ప్రతీ నెల ఇంటికి వందరూపాయలు జమ
- ప్రస్తుతం రూ.18 లక్షలతో కొనసాగుతున్న సంఘం
- వడ్డీ లేకుండా విత్తనాలు, ఎరువులు సరఫరా


ఇంటింటికీ ఎరువు బస్తాలు పంపిణీ చేస్తున్న సభ్యులు (ఫైల్)

ఇచ్చోడ: మండలంలోని మల్యాల్ గ్రామ పంచాయతీ పరిధిలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న 30 ఆదివాసీ కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఆయా కుటుంబాల్లో దాదాపు 200ల మంది జనాభా ఉన్నారు. ఏటా గూడెంలో జరిగే వివాహాలు, వ్యవసాయంతో పాటు ఇతర అవసరాలకు ప్రైవేట్ వ్యాపారుల నుంచి అధికవడ్డీకి అప్పు తెచ్చుకునేవారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు పండకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక నానాఅవస్థలు పడేవారు. వీటన్నింటి పరిష్కారంకోసం గూడెం పెద్దలు ఒక నిర్ణయానికి వచ్చి సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

తొమ్మిదేళ్ల క్రితం సంఘంగా ఏర్పాటు

గూడెంలో నివాసం ఉంటున్న 30 కుటుంబాలు సంఘంగా ఏర్పడ్డారు. ప్రతీ కుటుంబం నుంచి నెలకు రూ.100 వసూలు చేసి సభ్యుల వద్ద జమచేశారు. అత్యవసరం అయిన వారికి రూ.3 చొప్పున వడ్డీకి ఇవ్వడం ప్రారంభించారు. తీసుకున్న వారు ఏటా సంక్రాంతి నాటికి వడ్డీతో సహా చెల్లించాలని నిబంధన పెట్టుకున్నారు.

అత్యవసరంతో ప్రారంభమై...

అత్యవసర సమయంలో వడ్డీకి డబ్బులు తీసుకోవడంతో ప్రారంభమైన సంఘం నేడు వివాహాలు, పంటల సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలుకు ఏటా వర్షాకాలం సీజన్‌కు ముందు ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున ఇచ్చే స్థాయికి చేరింది. ప్రస్తుతం సంఘంలో రూ.18 లక్షలు జమయ్యాయి. ఈ ఏడాది రూ.4 లక్షల విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి అవసరం ఉన్న వారికి అందజేశారు. ప్రతీ కుటుంబానికి వ్యవసాయ పనులకోసం రూ.50 వేల నగదు కూడా అందజేశారు. వ్యవసాయం కోసం తీసుకున్న విత్తనాలు, ఎరువులకు వడ్డీ తీసుకోకపోవడం ఈ సంఘానికి ఉన్న మరో ప్రత్యేకత.

నిర్ణయానికి కట్టుబడి..



గూడెం పెద్దలు తీసుకున్న నిర్ణయానికి సభ్యులంతా కట్టుబడి ఉంటారు. తొమ్మిదేళ్ల క్రితం సంఘం ఏర్పాటుకు ముందు గూడెమంతా వ్యవసాయం చేయడానికి డబ్బులు లేక ఇబ్బందులకు పడేవారు. దీంతో సంఘం ఏర్పాటు చేసుకున్నాం.
– మెస్రం రామారావు, గూడెం పటేల్

అభివృద్ధివైపు అడుగులు



సంఘం ఏర్పాటు తర్వాత గూడెం అభివృద్ధిలోకి వచ్చింది. గతంలో ప్రైవేట్ వ్యాపారుల వద్ద తీసుకున్న అప్పులు తడిసి మోపెడు కావడంతో తీర్చే మార్గం కోసం వెతికేవాళ్లం. ప్రస్తుతం విత్తనాలు, ఎరువుల కోసం తీసుకున్న అప్పుకు వడ్డీ లేకపోవడంతో అదనపు భారం పడడంలేదు. దీంతో గూడెం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది.
– మెస్రం దేవురావు, సంఘం ప్రధాన కార్యదర్శి

విద్యుత్‌షాక్‌తో విద్యార్థికి గాయాలు


చికిత్స పొందుతున్న భుజంగరావు

నార్నూర్: మండలంలోని ఖంపూర్ గ్రామానికి చెందిన గేడం వసంతరావు కుమారుడు గేడం భుజంగరావుకు బుధవారం విద్యుత్ షాక్ తగలడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా సమీపంలో ఉన్న ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోకుండా కట్టిన తీగను పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వసంతరావు గమనించి గట్టిగా లాగడంతో ప్రమాదం తప్పింది. చేతి బొటనవేలు వద్ద పూర్తిగా కాలిపోవడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఉట్నూర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. వైద్యులు పరీక్షించి ప్రాణపాయం తప్పిందన్నారు.

నీట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఆదిలాబాద్‌టౌన్: మెడికల్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్ఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులు వై.అశ్విన్ రెడ్డి 720 మార్కులకు గానూ 580, రాథోడ్ 527, ఆదిత్య 493, అనీష్ 482, అను 421, అన్విక 418, సాత్విక 405 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు కె.బ్రహ్మం, జైపాల్ రెడ్డి, అరవింద్, లెక్చరర్లు అభినందించారు.

సత్తాచాటిన సమృద్ధి


సమృద్ధి

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన రాథోడ్ ఉల్లాస్, హారతి దంపతుల కుమార్తె రాథోడ్ సమృద్ధి నీట్ ఫలితాల్లో 620 మార్కులు సాధించి సత్తా చాటింది.

కార్మికుల సంక్షేమమే 'ప్రవాసీమిత్ర' లక్ష్యం


మాట్లాడుతున్న స్వదేశ్ పరికిపండ్ల

నిర్మల్‌ఖిల్లా: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమమే తమ సంఘం ప్రధాన లక్ష్యమని ప్రవాసిమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్ సమీపంలో మార్బుల్ టైల్స్, గ్రానైట్ కార్మికుల సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌ఘడ్, తదితర రాష్ట్రాల నుంచి వచ్చి కష్టతరమైన పనులు చేస్తున్నారన్నారు. వీరంతా కలిసి ఒక సంఘంగా ఏర్పడి డిమాండ్ల సాధన కోసం సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన భవన నిర్మాణ రంగ సంక్షేమ పథకాల కోసం ఈ–శ్రమ్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం సమన్వయకర్త కొమ్ము గీత, సభ్యులు డేవిడ్, స్వామి ట్రేడ్ యూనియన్ కార్యవర్గ సభ్యులు అజయ్, అఫ్రోజ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరుచోట్ల భారీగా గుట్కా పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: తమకు అందిన సమాచారం మేరకు పట్టణ పోలీసులు బుధవారం స్థానిక గుండవార్ జిన్నింగ్ మిల్లు గోదాంపై దాడి చేసి రూ.4 లక్షల 44 వేల విలువైన గుట్కా తంబాకు పట్టుకున్నట్లు సీఐ అశోక్ తెలిపారు. పట్టణానికి చెందిన షేక్ రిజ్వాన్ అనే గుట్కా వ్యాపారి గుండవార్ జిన్నింగ్ మిల్లును అద్దెకు తీసుకుని అందులో గుట్కా తంబాకు దందా నడిపిస్తున్నాడు. మహారాష్ట్ర నుంచి కుల్ల గుట్కా తంబాకు తీసుకువచ్చి మాజాటిన్ డబ్బాల్లో ఒరిజినల్ లాగా ప్యాకింగ్ చేసి విక్రయానికి పాల్పడుతున్నాడు. దాడిలో భాగంగా గుట్కా తంబాకుతో పాటు ప్యాకింగ్ మిషన్, 240 వరకు ఖాళీ టిన్ డబ్బాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. యజమాని రిజ్వాన్ పరారీలో ఉండగా వర్కర్ అబ్దుల్ ఇర్ఫాన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లు నరేశ్, రమేశ్, క్రాంతి, పాల్గొన్నారు.

తాంసి బస్టాండ్‌లో..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో గల జేపీ ట్రేడర్స్ యజమాని ఇజాజ్ అహ్మద్ అక్రమంగా నిల్వఉంచిన అంబర్, నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను టూటౌన్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు షాపులో దాడులు నిర్వహించగా రూ.11వేల విలువ గల పొగాకు ఉత్పత్తులు లభించినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఉట్నూర్‌లో రూ.1,87,200 విలువైన గుట్కా ..

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో బుధవారం నిషేధిత గుట్కాను పట్టుకున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వాహనాల తనిఖీ చేపడుతుండగా ఉట్నూర్‌కు చెందిన వ్యాపారి వద్ద రూ. 1,87,200 విలువ గల గుట్కాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిషేధిత గుట్కా విక్రయాలు జరిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.3.72 లక్షల విలువైన గుట్కా..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ సమీపంలో బుధవారం నిషేధిత గుట్కా పట్టుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణం నుంచి వాహనంలో తరలిస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు రాంపూర్ సమీపంలో దాడులు నిర్వహించి రూ.3.72 లక్షల విలువ చేసే నిషేధిత గుట్కాను పట్టుకున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మహ్మద్ అక్రమ్, సయ్యద్ అల్లాబాకస్‌లను అదుపులోకి తీసుకున్నారు. గుట్కా, వాహనం స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గత నెల 24న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన కారుకూరి రాజమణి (53) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. గుడిపేటకు చెందిన రాజమణి కొంతకాలంగా అనారోగ్యంతో పాటు ఇంటి సమస్యలతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెంది గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. మృతురాలికి భర్త సత్తయ్య, కుమారులు అంజనేప్రసాద్, ప్రశాంత్ ఉన్నారు. కుమారుడు అంజనేయప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నేరడిగొండ: మండలంలోని దూద్‌గండి జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు (30) మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతిచెందగా మృతదేహం గుర్తు పట్టని విధంగా మారింది. ఆనవాళ్లను బట్టి నేపాల్‌కు చెందిన వ్యక్తిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ఎత్తు 4.5 ఫీట్లు ఉందని, బ్లూ కలర్ జీన్స్ పాయింట్, తెలుపు రంగు టీషర్ట్ ధరించి ఉన్నాడు. వివరాలు తెలిసిన వారు 8712659947 నంబరులో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్‌లో నిర్మల్–ఖానాపూర్ ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనంపై నుంచి పడి మహిళకు గాయాలయ్యాయి. కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన వేదిక–వెంకటి దంపతులు బైక్‌పై నిర్మల్ నుంచి ఖానాపూర్ వస్తుండగా మహిళ అకస్మాత్తుగా కళ్లు తిరిగి రోడ్డుపై పడిపోయింది. 108కు సమాచారం ఇవ్వడంతో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇంటర్ ప్రవేశాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

నార్నూర్: పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశం పొందాలని అధ్యాపకులు చదల నరేశ్, ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం పొలంబాట పట్టి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఉచిత పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు, అనుభవం కలిగిన అధ్యాపకులచే విద్యా బోధన జరుగుతోందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

లింగాపూర్: బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పిక్లాతండాలో చోటు చేసుకుంది. ఎస్సై కొట్టే ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బోడా దేవులిబాయి (59) కొంతకాలంగా మద్యం సేవించి ఇరుగు పొరుగు వారితో గొడవ పడుతుండేది. ఆమె కుమారుడు బోడా శంకర్ మందలించడంతో మనస్తాపానికి గురైంది. బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అనారోగ్య సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హాజీపూర్ మండలం పెద్దంపేటలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బెంబడి బక్కయ్య(70) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య పోసు, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌లోనూ బీజేపీదే ఆధిపత్యం

- ఎంపీ నగేశ్‌కు అత్యధికంగా 9232 ఓట్లు
- 5,183 ఓట్లతో రెండో స్థానంలో ఆత్రం సుగుణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనే బీజేపీ తన ఆధిక్యతను చాటుకుంది. ఆ పార్టీ తరపున ఎంపీగా గెలుపొందిన గోడం నగేశ్ ఈవీఎం ఓట్లలో భారీ మెజార్టీని సాధించగా పోస్టల్ బ్యాలెట్‌లోనూ ఇతర అభ్యర్థుల కంటే ఆధిక్యతను కనబర్చారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ వంటి ప్రధాన పార్టీలతో కలిపి మొత్తం 12 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 15,503 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఇందులో 112 ఓట్లు నోటాకు పోగా మరో 841 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగతా ఓట్లలో అత్యధికంగా బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ 9232 ఓట్లను సాధించి అగ్రస్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ 5,183 ఓట్లతో రెండో స్థానంలో నిలువగా బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు కేవలం 837 ఓట్లు మాత్రమే రావడంతో మూడో స్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల వరకు రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా ఉన్న బీఆర్ఎస్ ప్రజల్లోనే కాకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లోనూ ఆదరణను కోల్పోయిందనేందుకు ఆపార్టీకి వచ్చిన ఓట్లే నిదర్శనంగా నిలుస్తున్నాయి. మిగతా అభ్యర్థుల వారీగా పరిశీలిస్తే... బీఎస్పీ అభ్యర్థి మేస్రం జంగుబాపుకు 55, గొండ్వాన దండకారణ్య పార్టీ అభ్యర్థి కొడప వామన్‌రావుకు 8, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మేస్రం గంగాదేవికి 23, ఇండియా ప్రజాబంధు పార్టీ తరపున పోటీ చేసిన గేడం సాగర్‌కు 8, అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చౌహాన్ సుదర్శన్ 26, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి ఎన్.తిరుపతికి 8 , అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ అభ్యర్థి మాలోత్ శ్యాంలాల్ నాయక్‌కు 10 ఇండిపెండెంట్ అభ్యర్థులైన బుక్యా జైవంత్ రావు 19 ఓట్లు, రాథోడ్ సుభాష్‌కు 94 ఓట్లు పోలయ్యాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న అజయ్‌కుమార్


నిర్మల్ రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్‌కుమార్ సూచించారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కొండాపూర్ బాలసదనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడు తూ ఓజోన్ పొర పరిరక్షణకు పచ్చని చెట్లు పెంచాలని సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి నాగమణి, ఏసీడీపీవో నాగలక్ష్మి, సూపర్‌వైజర్ మంగళ, బాలసదనం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఎం.కవిత, సుమలత, మధుసూదన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి దేవి మురళి, న్యాయవాదులు రాజలింగం, లింగాగౌడ్, నరేందర్, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది ఎస్.రాజు, శ్రీనివాస్, నరేందర్, లక్ష్మణ్, మమత, శైలజ, కరుణశ్రీ పాల్గొన్నారు.

ఆర్మీ జవానుకు కన్నీటి వీడ్కోలు


అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు

సిరికొండ: ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ సూర్యవంశి రాజేందర్(32)కు బుధవారం కుటుంబ సభ్యులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పొన్న ఎక్స్‌రోడ్డు నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్మీ అధికారులు సైనిక వందనం చేశారు. జాతీయ పతాకాన్ని భౌతిక కాయంపై ఉంచి నివాళులు అర్పించారు. ఆర్మీజవాన్ ఆఖరి చూపు కోసం జనం భారీగా తరలివచ్చారు.

చిరుతపులి దాడిలో చుక్కలదుప్పి హతం


దుప్పి కళేబరం

రామకృష్ణాపూర్: బొక్కలగుట్ట గాంధారిఖిల్లాలో చిరుతపులి దాడిలో చు క్కల దుప్పి హతమైన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఖిల్లా దిగువ భాగానికి వెళ్లిన ఉ పాధిహామీ కూ లీలు దుప్పి కళేబరాన్ని గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వేసవి దృష్ట్యా దాహం కోసం వచ్చిన దుప్పిపై చిరుతపులి దాడి చేయడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు.

భయాందోళనలో గ్రామస్తులు

చిరుతపులి సంచారం, దుప్పి మృతి ఘటన గాంధారి ఖిల్లా పరిసర ప్రాంతాల్లో అలజడి రేపుతోంది. కొన్ని నెలల క్రితం చిరుతపులి సంచరిస్తున్న విషయం బయటకు రావటం ఇప్పుడు దుప్పి కళేబరం వెలుగులోకి రావడంతో సహజంగానే ఆందోళన మొదలైంది. గాంధారి ఖిల్లా పరిసర గ్రామాలైన బొక్కలగుట్ట, పులిమడుగు ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. కాగా ఈ దాడి ఘటన మంచిర్యాల జిల్లాలో సంచలనం రేపింది.